క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న వంశీకృష్ణ శ్రీనివాస్ దంపతులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు స్వామివారి ప్రసాదాన్ని సూపరింటిండెంట్ సునీల్ అందజేశారు.

సబ్బవరంలో నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

సబ్బవరం : మండలంలోని సబ్బవరం - 1 సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పాల్గొంటారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

తీరంలో విజిబుల్ పోలీసింగ్



బీచ్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

జగదాంబ: పర్యాటకుల సంరక్షణ నేపథ్యంలో సాగరతీరాల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. రద్దీగా ఉండే ఆర్కేబీచ్, రుషికొండ బీచ్ వద్ద పర్యాటకులను అలెర్ట్ చేశారు. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు మరింత నిఘా పెంచారు.

గంట్ల శ్రీనుబాబుకు మంత్రి అమర్‌నాథ్ పరామర్శ



శ్రీనుబాబు కుటుంబ సభ్యులతో మంత్రి అమర్‌నాథ్

సింహాచలం : వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబును రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. ఇటీవల గంట్ల శ్రీనుబాబు తండ్రి తాతారావు మృతి చెందడంతో ఆయన స్వగృహానికి శనివారం రాత్రి అమర్‌నాథ్ వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. పెందుర్తి మండల పరిషత్, జిల్లా పరిషత్ కార్యాలయ ఉద్యోగిగా తాతారావు అందించిన సేవలను కొనియాడారు.

జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న నర్సింగరావు

పెదగంట్యాడ: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్, కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణం రెడ్డి నర్సింగరావు అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు అక్టోబర్‌లో కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అక్కడ విజయం సాధించిన వారు నవంబర్‌లో విశాఖలో నిర్వహించనున్న జాతీయ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. గంటా నూకరాజు, సూర్యప్రకాశరావు, ప్రేమ్ కుమార్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

ఘనంగా స్వర్ణపుష్పార్చన

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 8 వరకు స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని జరిపించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.



నిత్య కల్యాణంలో యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



స్వర్ణ పుష్పాలు

అనధికారిక పార్కింగ్‌తో అష్టకష్టాలు

పరవాడ: అనధికారికపార్కింగ్‌లతో తరచూ అష్టకష్టాలు ఎదురవుతున్నాయి. మండలంలో లంకెలపాలెం కూడలి, పరవాడ మండల కాంప్లెక్సు, సినిమాహాలు కూడలి, ఊటగెడ్డ కూడలి, సింహాద్రి ఎన్టీపీసీ కూడలి ప్రాంతాల్లో నిత్యం రోడ్లపై ఇష్టానుసారంగా భారీ వాహనాలను నిలిపేయడంతో మిగతా వాహనచోదకులు, ఉద్యోగులు, విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. హిందూజా పరిశ్రమకు రాకపోకలు సాగించే బొగ్గు లారీలు, ఎన్టీపీసీకి వచ్చే భారీ వాహనాలను రోడ్ల పక్కన పార్కు చేసి, ప్రధాన కూడళ్లలో ఉన్న టీ షాపులు, భోజన హోటళ్లకు సిబ్బంది వెళ్లిపోతున్నారు. ఇలా పెద్ద సంఖ్యలో వాహనాలను వరుసగా నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు భారీ వాహనాలను తప్పించే క్రమంలో వాహనాలు అదుపు తప్పి జారి పడుతున్నామని ప్రయాణికులు చెబుతున్నారు. అనధికారిక పార్కింగ్‌ల విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రోడ్లపై అనధికారిక పార్కింగ్‌లపై దృష్టి పెట్టి, చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



వాడచీపురుపల్లి రహదారిలో నిలిపిన భారీ వాహనాలు

కంటైనర్ ఢీకొని మహిళ మృతి

మల్కాపురం: మారుతి సర్కిల్ వద్ద ఓ కంటెయినర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలపాలై, అపస్మారక స్థితికి వెళ్లిపోయిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడ సమీపంలోని ఫార్మసీ కాలనీకి చెందిన సి.సరోజిని (37) భర్తతో మనస్పర్థల కారణంగా విడిగా జీవిస్తున్నారు. ఆమెకు ఇద్దరు అమ్మాయిలు సంతానం. వారు హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. సరోజిని సొంత పనుల నిమిత్తం ఆదివారం ఉదయం నగరానికి స్కూటీపై వెళ్లి, తిరిగి వస్తుండగా వీడీఆర్ గొడౌన్స్ సమీపంలోని మారుతి సర్కిల్ వద్ద వెనుక నుంచి వస్తున్న కంటెయినర్ వేగంగా ఢీకొట్టి, కొంత దూరం ఈడ్చుకు వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. స్థానికులు మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చి, ఆమెను షీలానగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు చేస్తుండగా ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని పోలీసులు శవపరీక్ష నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి బంధువులకు సమాచారమిచ్చారు. మల్కాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో అపస్మారక స్థితిలో ఉన్న సరోజిని

ఒడియా భాషలోకి 'సింహాచలం క్షేత్ర మహత్యం'

సింహాచలం: ఒడియా భాషలో రచించిన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్ర మహత్యం పుస్తకావిష్కరణ ఆదివారం సింహగిరిపై ఘనంగా జరిగింది. సింహాచలానికి చెందిన పాంతరాత్ర ఆగమశాస్త్ర పండితుడు టి.పి.శ్రీరామచంద్రాచార్యులు తెలుగులో రచించిన సింహాచలం క్షేత్ర మహత్యం పుస్తకాన్ని ఒడియా భాషలోకి భక్తుడు సాయికుమార్ తర్జుమా చేశారు. ఆ పుస్తకాలను స్వామివారి ఆలయంలో దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్‌నాయక్ దాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవోలు వి.బి.వి.రమణమూర్తి, భ్రమరాంబ, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఈవో త్రినాథరావు, లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్

'కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలి'

కూర్మన్నపాలెం: కార్మికులు పట్టు వదలక చేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 878వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థా మిగలదన్నారు. ఇప్పటికే దేశంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాక, నిరుద్యోగ సమస్యతో యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని మండిపడ్డారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా భారతీయులు ఆర్థికంగా ఇంకా వెనుకబడి ఉన్నారని, ఈ సమయంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌వారికి అమ్మాలని చూడడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉంటూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

గంగవరం పోర్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని టీఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. జీతాలు పెంచాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన సమీపంలోని స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద నిరవధిక దీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ దీక్ష శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వేణుగోపాల్ రెడ్డి, సమ్మిడి రాజు, పంచదార్ల పెంటారావు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. వామపక్ష, కార్మిక సంఘాల సంఘీభావం దీక్ష శిబిరాన్ని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఉక్కు నిర్వాసితుల కార్మిక సంఘం, నిర్వాసిత సంఘాల నాయకులు ఆదివారం సందర్శించారు. కార్మికులకు మద్దతు తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు బూసి వెంకటరావు మాట్లాడుతూ తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేఎస్ఎస్ రావు, మసేనురావు, ఎల్లేటి శ్రీనివాసరావు, కేఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న పైడిరాజు

యువకుడు అదృశ్యం

సింహాచలం : యువకుడు అదృశ్యమైన సంఘటనపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అంతకాపల్లికి చెందిన వనం హరీష్ (23) హైదరాబాద్‌లో టీసీఎస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 6న అంతకాపల్లి నుంచి పెందుర్తి మండలంలోని పినగాడిలో ఉంటున్న అమ్మమ్మ బైలపూడి కృష్ణమ్మ ఇంటికి వచ్చాడు. తిరిగి రాత్రి 7 గంటల సమయంలో అంతకాపల్లికి వెళ్తున్నట్టు చెప్పి బయలుదేరాడు. కానీ అంతకాపల్లి రాలేదనని కృష్ణమ్మ కూతురు చెప్పడంతో అతని ఆచూకీ కోసం వెతికారు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో పెందుర్తి పోలీసులకు కృష్ణమ్మ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల క్రమశిక్షణ బాధ్యత తల్లిదండ్రులదే

ఆరిలోవ: విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఆదివారం కృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సమావేశ మందిరంలో 'విద్యార్థుల క్రమశిక్షణ-తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర' అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లల బంగారు భవిష్యత్‌కు విద్యార్థి దశ కీలకంగా నిలుస్తుందన్నారు. ఈ దశను అన్ని కోణాలలో తీర్చిదిద్దితేనే వారి ప్రగతి సాధ్యపడుతుందన్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు భారత జాతి గర్వించదగిన పిల్లలుగా పేరు ప్రఖ్యాతులు సాధించేందుకు అహర్నిశలు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు వారిని నిరంతరం గమనిస్తూ అవసరమైన సూచనలు చేయాలని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ బి.కె.రమేష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులు క్రమశిక్షణతో పెరిగేలా సమావేశాలు, సదస్సులు ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించి పాఠశాల ప్రతిష్టను మరింత పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ, స్వారో సంస్థ ప్రతినిధి కనక రాజు, స్కూల్ పేరెంట్ కమిటీ అధ్యక్షుడు గోవింద్, ప్రతినిధి నీలవేణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

350 మందికి వైద్య పరీక్షలు

సింహాచలం : పెందుర్తి జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ అయ్యప్ప కాలనీలో ఆదివారం సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెందుర్తి పీఏసీఎస్ అధ్యక్షుడు శరగడం నరసింహమూర్తి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గాజువాకకి చెందిన ఆర్‌కే ఆస్పత్రి వైద్య సిబ్బంది 350 మందికి కంటి, కిడ్నీ, జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. 40 మందికి ఆస్పత్రిలో వైద్య సేవలు అందించేందుకు ఎంపిక చేశారు. డీఆర్‌సీ చారిటబుల్ ట్రస్ట్ అధినేత దాడి రమణ చిట్టిబాబు, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ శోభారాణి, డాక్టర్ వి.చైతన్య, డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ రాజు, డాక్టర్ నీరజ వైద్య పరీక్షలు నిర్వహించారు. కందుల నవీన్, సీరపు మహేశ్వరరావు, తాడివాడ గణేష్, ఆర్‌కే ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న ప్రతినిధులు

నేడు, రేపు అంగన్‌వాడీల ఆందోళన

పరవాడ: రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10, 11 తేదీల్లో కలెక్టర్ల కార్యాలయాల వద్ద తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సబ్బవరం ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఎం.రమణి పిలుపునిచ్చారు. లంకెలపాలెంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అమ్మఒడి, తదితర ప్రభుత్వ పథకాలను అంగన్‌వాడీ కార్యకర్తలకు వర్తింపజేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, యూనియన్ నాయకులు బి.దేవి, అన్నా లక్కమ్మ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రమణి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులంతా కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. సాయంత్రం వరకు ఆట పాటల్లో మునిగితేలారు.

ప్రజల చెంతకే 'ఫ్యామిలీ ఫిజీషియన్'

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని మండలంలో సమర్థంగా నిర్వహిస్తున్నారు. సబ్బవరం పీహెచ్‌సీ పరిధిలోని సచివాలయాల్లోని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి కోరారు. నెలలో 24 రోజులపాటు పీహెచ్‌సీ పరిధిలోని 10 సచివాలయాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఒక మెడికల్ ఆఫీసర్‌తోపాటు ఎమ్ఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆశ కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని సచివాలయాల పరిధిలో షెడ్యూల్ ఇదీ...



వారం	సచివాలయం పేరు	మెడికల్ ఆఫీసర్
1వ సోమవారం	సబ్బవరం - 3	డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి
1వ మంగళవారం	సబ్బవరం - 4	డాక్టర్ సీహెచ్ ఆశ
1వ బుధవారం	ఆరిపాక	డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి
1వ గురువారం	అసకపల్లి	డాక్టర్ సీహెచ్ ఆశ
1వ శుక్రవారం	నారపాడు - 2	డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి
1వ శనివారం	పైడివాడ అగ్రహారం	డాక్టర్ సీహెచ్ ఆశ
2వ సోమవారం	బంగారమ్మపాలెం	డాక్టర్ సీహెచ్ ఆశ
2వ మంగళవారం	గోటివాడ	డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి
2వ బుధవారం	నారపాడు - 1	డాక్టర్ సీహెచ్ ఆశ
2వ గురువారం	పెదగొల్లలపాలెం	డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి
2వ శుక్రవారం	ఇరువాడ	డాక్టర్ సీహెచ్ ఆశ
2వ శనివారం	నక్కవానిపాలెం	డాక్టర్ సీహెచ్ ఆశ
3వ సోమవారం	సబ్బవరం - 3	డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి
3వ మంగళవారం	సబ్బవరం - 4	డాక్టర్ సీహెచ్ ఆశ
3వ బుధవారం	పెదయాతపాలెం	డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి
3వ గురువారం	ఎరుకునాయుడుపాలెం	డాక్టర్ సీహెచ్ ఆశ
3వ శుక్రవారం	నల్లరేగులపాలెం	డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి
3వ శనివారం	పైడివాడ	డాక్టర్ సీహెచ్ ఆశ
4వ సోమవారం	ఆర్‌పీ అగ్రహారం	డాక్టర్ సీహెచ్ ఆశ
4వ మంగళవారం	గాలిభీమవరం	డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి
4వ బుధవారం	అజయ్‌నగర్	డాక్టర్ సీహెచ్ ఆశ
4వ గురువారం	తమ్మయ్యపాలెం	డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి
4వ శుక్రవారం	బలిజపాలెం	డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి
4వ శనివారం	చినయాతపాలెం	డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి

శాకాహారంతో ఆరోగ్యం పదిలం



ప్రచారంలో పాల్గొన్న స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు

గాజువాక: శాకాహార విశిష్టతను వివరిస్తూ స్థానిక పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతినిధులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. సొసైటీ నిర్వాహకురాలు కళావతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని పిరమిడ్ మాస్టర్ వర్మరాజు జోగవానిపాలెంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా శాకాహార విశిష్టతను సొసైటీ ప్రతినిధులు కరపత్రాల ద్వారా స్థానికులకు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్లు ఎం.శివగణేశ్వరరావు, ప్రతినిధులు జయలక్ష్మి, శేషారత్నం, పీఎస్ఎన్ మూర్తి, సి.జగదీశ్వరి, పద్మావతి, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా తప్పనిసరి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విభాగం ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్(వైసీటీ)తో సంయుక్తంగా ఏయూ ఆనుష్టాన యోగ వేదాంత ఫర్ హోలిస్టిక్ లివింగ్ అంశంపై ఈ సదస్సు నిర్వహించాయి. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన తప్పనిసరని చెప్పారు. ఈ సదస్సులో 200 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. బెంగళూరు వ్యాస యూనివర్సిటీ వీసీ డాక్టర్ నాగేంద్ర మానవులలో పెరిగే మానసిక ఒత్తిడి పర్యవసానాలు-ఆరోగ్య సమస్యలు అంశంపై ప్రసంగించారు. వ్యక్తి ఆరోగ్యానికి యోగా ఉపకరిస్తున్న పద్ధతులను తెలియజేశారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు మాట్లాడుతూ యోగా కేంద్రం విశ్వవిద్యాలయానికి అతిపెద్ద వనరుగా నిలుస్తోందన్నారు. యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ టి.ఎల్.నరసింహారావు మాట్లాడుతూ ఒత్తిడిని నివారించడం, నియంత్రించడంలో యోగా విధానా లు, ఉపయోగాలు తెలియజేశారు. సదస్సు కన్వీనర్ ఆచార్య కె.రమేష్‌బాబు, సంచాలకులు ఆచార్య ఓ. ఎస్.ఆర్.యు.భానుకుమార్, డాక్టర్ సి.శ్రావణి, డాక్టర్ ఆర్.తులసీరావు, డాక్టర్ జ్యోత్స్న అగర్వాల్, డాక్టర్ డి.వెంకటరావు, ఆచార్య పి.రవీంద్రనాథ్, డాక్టర్ శ్రీ కృష్ణ, డాక్టర్ సునీత, నాగిరెడ్డి పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అతిథులు

'మరో గ్రంథాలయ ఉద్యమానికి సిద్ధం కండి'

మురళీనగర్: పుస్తక పఠనంపై విద్యార్థులు, ప్రజల ల్లో అవగాహన కల్పించడానికి మరో గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించనున్నట్లు 'మరో గ్రంథాలయ ఉద్యమం' ప్రతినిధి బి.వెంకటపతిరాజు చెప్పారు. పుస్తక పఠనం ప్రాధాన్యతపై మాధవధార ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పుస్తక పఠనం ప్రాధాన్యత తగ్గిపోతోందని, వచ్చే దశాబ్దంలో పుస్తకం అంతరించే ప్రమాదం ఏర్పడిందన్నా రు. పుస్తక పఠనంలో ఉన్న ఆనందం, దాని వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నా రు. రాష్ట్ర వ్యాప్తంగా కాలేజీలు, పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయడానికి మరో గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్వహించాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు దీన్ని ఒక సామాజిక ఉద్యమంగా చేపట్టాలని కోరారు. సెల్‌ఫోన్ రుగ్మత నుంచి విద్యార్థులను బయటపడేలా చేయాలన్నా రు. ఈనెల 16వ తేదీన విజయవాడలో రాష్ట్ర స్థాయి మహాసభ నిర్వహిస్తామని ఇందులో గ్రంథాలయ ఉద్యమ కార్యకర్తలు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా మహాసభ గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమ కార్యకర్తలు పెద్దినాయుడు, కె.శ్రీనివాస్, టి.రామకృష్ణ, ఆర్.రమణమ్మ, విజయశ్రీ, ఉమాపతి, సునీత, నీరజ, సత్యనారాయణ పాల్గొన్నారు.